# మిఠాయి చేదు

**వాణిశ్రీ**

"అన్నా! నీ బర్త్‌డే దగ్గరకొచ్చిందే" అన్నాడు జంబులింగం.

అమరేశ్‌బాబుకి ఈమధ్య సరిగా వినిపించడం లేదు. చెవులు రిపేరుకొచ్చాయి. మిషను పెట్టించినా పెద్దగా ఇంప్రూవ్‌మెంటు లేదు. ఏదో కాలం నెట్టుకెళ్తున్నాడు. అన్నిటికీ తల వూపుతున్నాడు. ఆ తల వూపుడికి అర్థమేమి తిరుమలేశా అని జనం జుట్టు పీక్కుంటున్నారు.

జంబులింగం చెప్పిందేమిటో వినపడక పోయినా తల వూపాడు అమరేశ్‌బాబు.

"ఎలక్షన్లు సంవత్సరం కూడా లేవు. ఏదోక హంగామా చేస్తేగాని జనానికి గుర్తుండదు" అన్నాడు మళ్ళీ.

"నువ్వు చెప్పింది అన్నకి వినపడిందంటావా?" అని సందేహం వెలిబుచ్చాడు అల్లావుద్దీన్.

ఈసారి గట్టిగా అరిచి చెప్పాడు జంబులింగం.

అమరేశ్‌బాబు ఉలిక్కిపడ్డాడు.

"ఏందిరా! అట్టా అరిచి చస్తావు. నాకేం చెవుడా?" అన్నాడు.

"కాదు. నాకు చెవుడు" అని గొణుక్కున్నాడు జంబులింగం.

అంతలోకే అమరేశ్‌బాబు వియ్యంకుడు ముత్యాలరావొచ్చి ఎదురుగా సోఫాలో చతికిలబడి "ఏందిరా సంగతి?" అన్నాడు. కరటక దమనకుల్లాంటి జంబులింగాన్ని, అల్లావుద్దీన్ని చూసి.

"రండి సార్! సమయానికొచ్చారు. అన్న బర్త్‌డే దగ్గరకొచ్చింది. ఎలక్షన్లు కూడా వచ్చేస్తున్నాయ్ కదా! ఈసారి గ్రాండ్‌గా చెయ్యాలి. వెంకటేశ్వర కళ్యాణ మండపం బుక్ చెయ్యాలా? వెంకటరెడ్డి గార్డెన్స్‌లో ఫంక్షన్ చేస్తే బాగుంటుందా అని ఆలోచిస్తున్నాం" అన్నాడు జంబులింగం.

ముత్యాలరావు ఫెళ్ళున నవ్వాడు. బోసినోట్లో వున్న నాలుగు పళ్ళు తళతళా మెరుస్తున్నాయి. కరటక దమనకులు బిత్తరపోయారు. నోరెళ్ళబెట్టి చూశారు.

"ఎనభై తొమ్మిదేళ్ళొచ్చాక ఇంకా బర్త్‌డేలేంట్రా నా బొంద. లక్షలు తగలేసి చెడ్డపేరు తెచ్చుకోకండి. ఈమధ్య రాజకీయ నాయకుల్ని జనం అసహ్యించుకుంటున్నారనీ, వాళ్ళంటే విలన్స్ అనే వ్యతిరేక భావం ప్రబలుతోందనీ, అసలు గౌరవం లేదనీ పేపర్లో రాస్తున్నారు. ఎమ్మెల్యేలు పైరవీలు చేసి డబ్బు సంపాదిస్తున్నారనీ, కాంట్రాక్టర్ల దగ్గర పర్సంటేజీలు గుంజుతున్నారనీ సమాజానికి చీడ పురుగులనీ..."

"ఇక ఆపావోయ్ నీ సొద" అన్నాడు అమరేశ్‌బాబు వియ్యంకుడివైపు కోపంగా చూస్తూ.

"సర్లెండి పేపరోళ్ళు అట్టాంటియ్యి రోజూ రాస్తుంటారు. అయ్యేవడు లెక్కజేత్తాడండీ. ఏ హడావుడీ చెయ్యకపోతే పేపర్లోకి ఎక్కేదెలా? పబ్లిసిటీ లేకపోతే ఈసారి సీటురావొద్దా! అన్న ఎనక మంత్రిగా వున్నప్పుడు పేపరోళ్ళు ఎంటబడి రాసేవోళ్ళు. ఇప్పుడేమో ఒట్టి ఎమ్మెల్యేనే గదా! అళ్ళెంట మనం పడాల" అన్నాడు జంబులింగం.

"పేపర్లోకి ఎక్కాలంటే బర్త్‌డే పార్టీలే చెయ్యాలంట్రా? ఆ పేరుతో మంచి పనులు చేస్తే బాగుంటుంది. పేపర్లో పబ్లిసిటీ వస్తుంది. జనం కూడా మెచ్చుకుంటారు" అన్నాడు ముత్యాలరావు.

"మంచి పనులా అయ్యేంది?" అని ఆశ్చర్యపోయాడు జంబులింగం.

"అరె ఎదవల్లారా! అట్టాంటియ్యి మీ అన్న ఎప్పుడైనా చేసేడిస్తే గదా మీకు తెలిసి చావడానికి. మంచి పనులంటే రోడ్లు వూడవడం, రక్తదానాలు చెయ్యడం, ఆసుపత్రులకెళ్ళి రోగులకు పళ్ళు, స్వీట్లు పంచడం వంటివన్న మాట" అన్నాడు ముత్యాలరావు.

"మాకు తెలుసులేవో! ఏదోకటి చేస్తాంలే" అన్నాడు అమరేశ్‌బాబు వియ్యంకుడి వైపు గుర్రుగా చూస్తూ.

ముత్యాలరావు కాసేపు కూర్చుని రెండు పెగ్గులు మందు తాగి చెక్కా సోయాడు.

ఇక ఆ తర్వాత ఎమ్మెల్యేగారి బర్త్‌డే పార్టీ ఎట్లా చెయ్యాలా అని కరకట దమనకులు నియోజకవర్గంలోని అనుచరులనందరినీ సమావేశపరిచారు.

ఫంక్షన్ హాల్లో తూ..తూ..మంత్రంగా బర్త్‌డే చేసి డిన్నర్ పార్టీ పేరుతో మందుపోసి, కోళ్ళను కోసి లక్షలు ఖర్చు చేసే బదులు అన్న వియ్యంకుడు చెప్పినట్లు మంచి పని ఏదో చెస్తే మంచి పబ్లిసిటీ వస్తుందని మంచి పనులు ఏవో డిస్కస్ చేయడం మొదలుపెట్టారు.

రోడ్లు వూడ్చుట అనే విషయం మీద చర్చపెట్టారు. అసలే ట్రాఫిక్ పెరిగిపోయింది. కార్లు, లారీలు, ఆటోలకే రోడ్లు చాలడం లేదు. మనుషులు నడవడానికి సందు దొరకడం కష్టమైపోయింది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యేగారు ముక్కుతూ, మూలుగుతూ చీపురు పట్టుకుని అనుచరగణంతో రోడ్డెక్కితే ఏమైనా వుందా? ట్రాఫిక్ జామైపోయి మైళ్ళ తరబడి బస్సులు, కార్లు, లారీలు ఆగిపోయి జనం పిచ్చెక్కిపోయి, తిట్టిన తిట్టు తిట్టకుండా పచ్చిబూతులు తిడతారు. ఈ ముసలాడికేం పోయేకాలం? ఇదేం రకం పబ్లిసిటీ? మళ్ళీ ఈయన వెంట టీవీ, కెమేరా వాళ్ళు, పత్రికా విలేకర్లు వగైరాలతోపాటు పోలీసులు గుంపులు గుంపులుగా హడావుడి చెయ్యడం వొహటి అని వినుక్కోరూ?

అంతగా పాపులార్టీ, పబ్లిసిటీ కావాల్సొస్తే ఇంత కంటే మంచిపని దొరకలేదా? కంపుకొడుతున్న ప్రభుత్వ ఆసుపత్రులలో జనరల్ వార్డులు వూడవచ్చు కదా? అక్కడ మరుగు దొడ్లు కడిగి ఫినాయిల్‌తో కడగ వచ్చు కదా? అని జనం రకరకాల కామెంట్స్ చెయ్యవచ్చు.

ఎమ్మెల్యేగారు రోడ్లు వూడవడం వల్ల జనాలు నరక యాతన పడ్డారనీ, గంటల తరబడి ట్రాఫిక్ జామైపోయిందనీ! ఒక గర్భిణీ స్త్రీ ఆటోలోనే ప్రసవించిందనీ, ఒక ముసలాయన వున్న అంబులెన్స్ దారి దొరక్క అందులోనే హరీ అన్నాడనీ కథనాలు కల్పించి టీవీలో హాట్ న్యూస్‌గా ప్రసారాలు చేయవచ్చు.

అసలు పబ్లిసిటీ దేవుడెరుగు యాంటీ పబ్లిసిటీ జరిగి ఎమ్మెల్యేగారిని ముఖ్యమంత్రిగారు మందలించవచ్చు. పార్టీ ప్రెసిడెంట్ షోకాజ్ నోటీసు జారీ చేసినా ఆశ్చర్యం వుండదు. కాబట్టి రోడ్లు వూడవడం అనే కార్యక్రమం వద్దనుకున్నారు.

ఈమధ్య చాలామంది రక్తదాన శిబిరాలు నిర్వహించి బోలెడు పాపులార్టీ సంపాదించుకుంటున్నారు. ఎమ్మెల్యేగారు కూడా రక్తదానం చేస్తే, అసలాయన వంట్లో రక్తం వుందా? లేక విస్కీనే వుందా? సీసాలోకి విస్కీ వస్తే చెడ్డపేరొస్తుందేమో? ఆయనగారి సంగతి అలా వుంచి ఆయనగారి అనుచరులైన పాపానికి తామంతా కూడా బల్లల మీద పడుకుని రక్తదానాలు చేయాలి గదా! రక్తం ఇచ్చే ముందు తమందరికీ ఎయిడ్స్ పరీక్షలేవో చేస్తారట గదా! అందులో తమలో కొందరికి ఎయిడ్స్ వుందని తేలితే నలుగురిలో పరువుపోద్ది. చాటుగా బైట పడితే అది వేరే సంగతి. ఈ మంచిపని కూడా అంత బాగా లేదనుకున్నారు.

సరే ఇంకేం మంచి పనులున్నాయి? గుడిలో పూజలు చేయట మంచిపనేనా? కాదా? మంచిపనే అయి వుంటుంది. ఎమ్మెల్యేగారు మాత్రం 'ససేమిరా' అన్నారు. తనకసలే బి.పి., సుగర్ వగైరా క్రానిక్ జబ్బులున్నాయి. మోకాళ్ళ నెప్పులు. కూర్చుంటే లేవలేడు. లేస్తే కూర్చోలేడు. బైపాస్ సర్జరీలయ్యాయి గుండెకు. పూజలు చేయాలంటే ఏవో ఫార్మాలిటీస్ వుంటాయి గదా! ఉపవాసాలు అవీ వుండాలని పూజారి డిమాండ్ చేస్తాడు. ఆ టైమ్‌లో సుగర్ డౌన్ అయినా, బి.పి. రెయిజ్ అయినా ప్రాబ్లమే. అంబులెన్స్‌లో హాస్పటల్‌కి పరుగెత్తాలి. దారిలో ఏ ట్రాఫిక్‌జాములోనో ఇరుక్కుంటే పుట్టిన రోజు గిట్టినరోజుగా మారినా మారొచ్చు. రిస్క్ ఎందుకు?


మంచిపని ఏది అజెండాలోకి వచ్చినా వర్కవుట్ కావడం లేదు. అనుచరగణం గ్రూప్ డిస్కషన్స్‌లో మందు పార్టీలు చేసుకుంటూ యమబిజీ అయిపోయారు. కానీ ఎమ్మెల్యే గారి బర్త్‌డేకి జరపవలసిన మంచి పనుల జాబితా ఖరారు కాలేదు.

ఒకరోజు రాత్రి న్యూస్ చూస్తుండగా ఒక ఛానల్ పదేపదే ఖైదీలకు స్వీట్లు పంచుట అనే కార్యక్రమం ప్రసారం చేయడం గమనించిన అమరేశ్‌బాబు 'యాహూ' అని కేకపెట్టాడు.

అనుచరగణం వులిక్కిపడ్డారు.

"ఓరి ఎదవల్లారా! అటు చూడండ్రా! టీ.వీ.ఛానల్ వాడు ఎట్టా కవరేజీ చేస్తున్నాడో! అదీ మంచి పనంటే" అని తెగమెచ్చుకున్నాడు.

అన్నకి నచ్చిన మంచి పనేదో అందరికీ అర్థమైపోయింది.



సీనియర్ ఎమ్మెల్యే అమరేశ్‌బాబు తొంభైయవ పుట్టినరోజు సందర్భంగా దినపత్రికలలో అనుచరగణాలకు చెందిన వ్యాపారసంస్థలు, కార్పొరేట్ కాలేజీలు వగైరా ఫుల్‌పేజీ కలర్ యాడ్స్‌తో దినపత్రికలను నింపేశారు.

అమరేశ్‌బాబు ఉదయమే గుడికి వెళ్ళి పూజలు చేసే కార్యక్రమం పూర్తయ్యాక, జైలు దగ్గరే ప్రెస్ కాన్ఫరెన్స్ అరేంజ్ చేసారు.

జైలు దగ్గర అన్ని పత్రికల విలేకరులు, టీవీ కెమేరాల వాళ్ళు వచ్చేశారు. కాన్ఫరెన్స్‌లో అమరేశ్‌బాబు ఖైదీల స్థితిగతులు బాగుపడాలనీ, అన్ని సౌకర్యాలు సమకూర్చాలనీ, అసలు నేరస్థులకు కాకుండా నేరాన్ని శిక్షించే వ్యవస్థ రావాలనీ వుపన్యాసం దంచాడు.

జైలర్ పూలమాలతోను, బొకేలతోను అమరేశ్ బాబుని సత్కరించి జైలులో అన్ని విభాగాలను తీసుకెళ్ళి చూపించాడు. మీడియా వాళ్ళు ఫాలో అవుతున్నారు.

ఖైదీలను బారులుగా నిలబెట్టి అమరేశ్ బాబు ప్రశస్తమైన స్వీట్ పేకెట్లు పంచిపెట్టాడు. ఖైదీలు యాంత్రికంగా పుచ్చేసుకున్నారు. వాళ్ళ ముఖాల్లో స్వీట్లు తీసుకున్న సంతోషం కనిపించడం లేదు. కనీసం ఎమ్మెల్యే గారికి హేపీబర్త్‌డే కూడా చెప్పడం లేదు.

అమరేశ్‌బాబు జంబులింగం, అల్లావుద్దీన్‌లతో గుసగుసలాడాడు.

"ఏంట్రా! అంతా మొఖాలు గంట్లు పెట్టుకుని చూస్తున్నారు. ఒక్కడన్నా హేపీబర్త్‌డే చెప్పలేదు"

"స్వీట్లతో పాటు కారా పేకెట్లు ఇవ్వలేదని అలా వున్నారేమో?" అన్నాడు జంబులింగం.

విషయం అది కాదని అనుభవజ్ఞుడైన అమరేశ్‌బాబుకి తోచింది. ఎందుకో అసంతృప్తితో వున్నారు. జైల్లో ఏదో సమస్య తన దృష్టికి తేవాలనుకున్నారేమో? అందుకు జైలు అధికారులు అడ్డుపడి ఎమ్మెల్యేగారి వరకూ విషయాలు పోగూడదన్నారేమో? అనుకున్నాడు.

'పాపం వాళ్ళ సమస్యలు ఏమిటో తనే స్వయంగా తెలుసుకుని సహాయపడితే బాగుంటుంది' అనుకుంటూ ఖైదీల దగ్గరకి వెళ్ళి పలకరించాడు.

"సోదరులారా! నా బర్త్‌డే సందర్భంగా మీకే స్వీట్లు పంచాలని ఎందుకు నిర్ణయించుకున్నానంటే, మీరంతా చిన్న చిన్న తప్పులు చేసి జైలు శిక్షపడి కుటుంబాలకు దూరంగా వుంటున్నారు. మీరు ఆనందంగా గడిపే రోజులు తక్కువగా వుంటాయి. అందువలన కాసేపైనా మీరు సంతోషంగా వుంటారని స్వీట్లు పంచిపెట్టాను. కానీ మీరెవరూ సంతోషంగా కనిపించడం లేదు. మీకేవైనా సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి. ముఖ్యమంత్రితో స్వయంగా మాట్లాడి పరిష్కరిస్తాను" అన్నాడు అమరేశ్‌బాబు.

"మాకే సమస్యలూ లేవు సార్! అంతా బాగానే వుంది" అన్నాడు ఒక ఖైదీ.

"మరేంటి?"

"మీరు ఇట్లా స్వీట్లు పంచడమే బాగాలేదు సార్!" మరొక ఖైదీ చెప్పాడు.

"అదేంటి? రెడ్డి మిఠాయిలు ప్రపంచంలోనే పేరు గాంచినై. అటువంటి మిఠాయిలు చేదుగా వున్నాయా?"

"ఔను సార్! మాకు మిఠాయిలు చేదే"

"మరేం కావాలి?"

"విస్కీ బాటిల్స్, బిర్యానీ పొట్లాలు. మీకు తెలియదేమో సార్! మాలోనే లోగడ నాయకులుగా పనిచేసి వచ్చిన వారు వున్నారు. ఇక్కడ ఎవరి బర్త్‌డే అయినా మందు పార్టీలే వుంటాయి. చీప్‌గా మిఠాయిలు పంచరు" చెప్పాడొక ఖైదీ.

"ఎమ్మెల్యేగారి బర్త్‌డే పార్టీ జైల్లో చేసుకుంటారట అనగానే మీరు విస్కీ సీసాలు, బిర్యాని పేకెట్లు తెస్తారని ఎదురుచూస్తున్నాం. మీరేమో వట్టి మిఠాయిలే పంచారు. మాకు తెలుసు. మీరు, మీ అనుచరులంతా ఈరోజు మందు పార్టీలు చేసుకుంటారు. ఎంత అన్యాయం సార్! మీరేమో మందు పార్టీలు చేసుకుంటారా? మేము మాత్రం మీ కార్యకర్తల లాంటి వాళ్ళం కాదా? ఇంత వివక్ష పనికిరాదు" ఆవేశంతో అన్నాడొక యువఖైదీ.

అమరేశ్‌బాబు బిత్తరపోతుండగా, జైలర్ హడావుడిగా టీవీ కెమేరా వాళ్ళని తరిమెయ్యడం మొదలుపెట్టాడు.

○